# ఇలలో ప్రణతార్తి హరుడనుచు...

హోటల్ గదిలో పూర్తిగా స్థిరపడిన తరువాత కిటికీ తెరలు పక్కకు తొలగించి పరికించి చూచాడు సత్యానందం. గది గోడకు ఆనుకుని కొంత ఖాళీస్థలం ఉంది. ఈ స్థలాన్ని వేరు చేస్తూ ఎనిమిది అడుగుల గోడ, గోడకు పక్కగా అయిదారు ఇళ్లు ఉన్నాయి. అయితే ఆ ఇళ్ల ముఖాలు దూరంగా అటువైపు ఉండడంతో సత్యానందానికి ఇళ్లవెనక పెరళ్లు మటుకే కనిపిస్తున్నాయి. ఈ రోజుల్లో కూడా ఇంటి వెనకగా ఖాళీ స్థలం వదలి గాలి, వెలుతురు రావటానికి అనుకూలం చేసిన యజమానిని అభినందించాల్సిందే - అనుకున్నాడు.

పరిశ్రమలు, వాణిజ్యం బాగా పెరిగిన తరువాత ఇళ్లముందు, వెనక, పక్కల ఖాళీ జాగా ఉండడం అపురూపం అయిపోయింది; ఓ మాదిరి పట్టణాలలో కూడా ! ఈ యజమాని యెవరో తనమాదిరే పాతకాలం వాడు అయివుంటాడు.

పాతకాలం అనే మాట మనసుకు రావడంతోటే సత్యానందం తనలో తాను నవ్వుకున్నాడు.

నిన్న ఉదయం దాటిపోయి మధ్యాహ్నం అవుతూ ఉండగా, రైల్వుస్టేషన్ నుంచి తిన్నగా ఈ హోటల్‌కు డ్రైవ్ చేశాడు.

రిసెప్షన్ కౌంటర్‌లో ఉన్న ఆసామీ గది తాళం చెవి తనకు ఇస్తూ, రూం బాయ్‌తో, ''అయ్యగారిని నూటెనిమిది గదికి తీసుకువెళ్లు, డబుల్‌రూం'' - అన్నాడు.

సత్యానందం అడిగాడు - ''నాకు సింగిల్ రూం చాలని రాశాను. డబుల్ రూం బుక్ చేశారా ? మార్పించండి, వీలయితే. ఎందుకు అనవసరంగా డబ్బు ఖర్చు-''

రిసెప్షన్ ఆసామీ, ''ఫరవాలేదులెండి, సమయానికి సింగిల్ రూం ఖాళీ లేదు. అందుచేత ఇది ఇచ్చాం. ఛార్జి మామూలుగానే చేస్తాం'' - అన్నాడు చిరునవ్వుతో.

డబుల్ రూంలో ఉంటూ సింగిల్ రూంకు మాత్రమే ఛార్జ్ ఇవ్వడం హోటల్ వాళ్లను దగా చేయడం కదా ! అయినా ఈ విషయంలో తనకెందుకు అంత పట్టింపు? డబ్బు ఇచ్చేది ఎలాగూ తాను కాదు. కాకపోయినా ఎవరిదయినా డబ్బే కదా ! ....

తనకేమీ ఆప్షన్ లేకపోవడం వల్ల ఇంకేం చేయలేదు. మాట్లాడకుండా రూం బాయ్ వెనకాల నడిచి తనకు కేటాయించిన గదికి చేరుకున్నాడు.

అతనలా చూస్తూ ఉండగానే బెల్ మోగింది. వెనక్కు తిరిగాడు. గది తలుపులు బిగించుకోలేదు. తెరిచే వున్నాయి. అయినా ఆ విషయం అవతల మనిషికి తెలియదు గనుక. తలుపు మీద చప్పుడు చేయకుండా లోపలకు జొరబడడం లక్షణం కాదు గనుక, సత్యానందం వెనక్కు నడిచి తలుపులు తెరిచాడు.

ఎదురుగా కార్యక్రమాల కార్యదర్శి.

''నమస్కారమండీ'' అన్నాడు నవ్వుతూనే. ''నేను''-

అతని మాటను పూర్తి చేయనీయకుండా ''తెలుసు. వెనక కలుసుకున్నాం గద, రండి'' అని గుమ్మంలోనుంచి అడ్డు తొలిగాడు సత్యానందం.

అతను కూర్చుంటూనే ''ప్రయాణంలో ఎక్కువ ఇబ్బంది కలుగ లేదు గద! స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకోవడం మాకు అలవాటు. మీరేమో వద్దని గట్టిగా రాశారు గదా ! మీకేమైనా అసౌకర్యం జరిగి ఉంటే మన్నించండి'' అన్నాడు.

''భలేవారే మీరు. ప్రత్యేకించి నాకేం సౌకర్యం కావాలి గనుక ? ఏమీ అసౌకర్యం లేదు. హాయిగా రైలు దిగాను. ఓ కప్పు కాఫీ తాగేసి, తిన్నగా టాక్సీలో ఈ హోటల్ ముందు దిగాను. పేరు చెప్పడం తోటే రూం తాళం చెవి ఇచ్చారు ఇక్కడ ... ఇంక స్నానం చేద్దామా అనుకుంటున్నాను. ఇంతలో మీరు వచ్చారు'' అన్నాడు సత్యానందం.

మీరు ఎంతయినా చెప్పండి. పొరుగు ఊళ్లనుంచి వస్తున్న వాళ్లను స్టేషన్‌లోనే కలుసుకుని ఓ పూలదండ వేసి గదికి తీసుకురావడం మా సంప్రదాయం మీరు పడనిచ్చారు కాదు'' అన్నాడు నిష్ఠురంగా రామతిలకం - ఆ కార్యదర్శి.

''నాకూ కొన్ని పద్ధతులు ఉన్నాయండీ. పూలు చెట్లకు ఉంటేనే ఆనందం - అనుకునే పాతకాలం వాడిని నేను. మీరు స్టేషన్‌కు రావాలంటే రెండు గంటలు ముందుగానే ఇంటి దగ్గర తయారుకావాలి. తీరా రైలు ఆలస్యం అయిందనుకోండి. ప్లాట్ ఫామ్ మీదనే దేవుడా - రాముడా అంటూ నన్ను మనసులోనే తిట్టుకుంటూ గడపాలి. మరో మనిషికి ఇబ్బంది కలిగించడం నాకు ఇష్టం కాదు. అందుకని నేను ఎక్కడకు వెళ్లినా ఇదే పద్ధతి ---''

''అందరూ మీలాంటి సహృదయులయితే ప్రపంచం ఎంతో బాగుండేది'' అన్నాడు రామతిలకం, మెచ్చుకోలుగా.

''ఇప్పుడు కూడా మీరు రావలసిన అవసరం లేదు. ఏదో మీ మంచితనం వల్ల వచ్చారు. ఆయాం సారీ -'' అన్నాడు సత్యానందం.

''మీరు గదిలోకి రాగానే నాకు టెలిఫోన్ చేసి చెప్పమని హోటల్ రిసెప్షన్‌లో నిన్ననే చెప్పాను. వీళ్లు పాపం చాలా మంచివాళ్లు'' అన్నాడు రామతిలకం మళ్లీ.

''సరే, ఇంతకూ ఏమిటి చెప్పండి?''

''సాయంత్రం ఆరుగంటలకు మీటింగ్. నేను పావు తక్కువ ఆరింటికి ఇక్కడికి వచ్చేస్తాను, కారుతో సహా. మీరు తయారుగా ఉండండి. మీటింగ్ అయిన తర్వాత మా ఇంటికి భోజనానికి రావాలి మీరు''.

''క్షమించండి, రాత్రిపూటలు నేను భోజనం చేయను''.

''పోనీ, ఫలహారమే చేయండి. తప్పకుండా రావాలి''.

''వద్దండీ, ఇటువంటి విషయాలలో నన్ను ఇబ్బంది పెట్టకండి. నేనూ అమితంగా తినగలిగిన మనిషిని కాదు. మీరు బొత్తిగా నిరాశపడిపోవలసి వస్తుంది.'' అని ఆ ప్రస్తావనకు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు సత్యానందం.

''సరే మీ ఇష్టం'' అనడం తప్ప రామతిలకానికి ఇంకో మార్గం లేకుండా పోయింది.

ఈ మధ్యాహ్నం భోజనానికి పిలవటానికి వీలులేకుండా సత్యానందం ముందుగానే రాశాడు. తన స్నేహితుడు కమలాకరం ఇంటికి వెడుతున్నానని, రేపు ఊళ్లోనే ఉన్నా టైమంతా మీటింగులతోనే సరిపోతుంది. యూనివర్సిటీలోనే లంచ్. రాత్రికి తిరుగు ప్రయాణమే!

''మీరు మా ఆహ్వానాన్ని మన్నించి ఇంత దూరం రావడమే మా భాగ్యం...'' అంటూ మళ్లీ మొదలుపెట్టాడు రామతిలకం.

''సరే.. ఆ సంగతులన్నీ సాయంత్రం వందన సమర్పణ సమయంలో చెబుదురుగాని! నేను భోజనం చేశాక ఒక గంటసేపు మా స్నేహితుడి ఇంట్లోనే రెస్ట్ తీసుకుని,

సాయంకాలం నాలుగున్నరకు ఈ రూంకు చేరుకుంటాను''.

''అయితే మీకు కారు ఎన్నిగంటలకు పంపమంటారు?''

''కారా ? ఎందుకు?''

''మీ స్నేహితుడి ఇంటికి వెళ్లడానికి, మళ్లీ ఇక్కడకు రావటానికీని!''

''అక్కర్లేదండీ. అతనే వచ్చి నన్ను తీసుకువెడతాడు''.

''సరే కానివ్వండి. మీరు విశ్రాంతి తీసుకోండి. నేను వెళ్లి వస్తాను -'' అని రామతిలకం లేచాడు, నమస్కారం చేస్తూనే.

సత్యానందం స్నానం చేసి, దుస్తులు మార్చుకుని తాపీగా కూర్చున్నాడు. సాయంకాలం తాను మాట్లాడవలసిన విషయం గుర్తు చేసుకుందామని నోట్స్ కాగితాల కోసం బ్రీఫ్‌కేస్ తీశాడు. అంతా పెళ్ళగించి ఎన్నిమార్లు చూచినా అది తప్ప తలిమ్మావన్నీ కనిపించాయి. సత్యానందానికి ఆశ్చర్యం అయింది. అంత ముఖ్యం అయిన కాగితాలు తాను ఎలా మరచిపోగలిగాడు ?

- నిజానికి అవేం అంత ముఖ్యమైన కాగితాలు కావు. తాను 'తయారు చేసిన ఉపన్యాసం' చదవబోవడం లేదు. ఎక్స్‌టెంపోర్‌గానే మాట్లాడుతున్నాడు. కాకపోతే నోట్స్ కాగితాలు ఉంటే అదో భరోసా, నిర్భీతిని!

మళ్లీ తయారు చేసుకోవచ్చును. దానికేం! పది నిముషాల పని! స్క్రిబ్లింగ్ పాడ్, పెన్ తీసుకుని మంచం మీద కూర్చున్నాడు. అన్నట్లు తను వీళ్లకు ఇచ్చిన టాపిక్ ఏమిటి?

తన కరెస్పాండెన్స్ కాగితాలు, నోట్సు, సభవాళ్లు అచ్చు వేయించి పంపిన కరపత్రం... అన్నీ ఒకే బొత్తిగా క్లాంప్ చేసి మరీ ఉంచాడు. ఆ బొత్తే కనబడడం లేదు గదా! ఏ విషయం మీద మాట్లాడాలో తెలియకుండా నోట్స్ తయారు చేసుకోవడం ఎలా ?

హోటల్ బాయ్ తెచ్చి పడవేసిన న్యూస్‌పేపర్ ఎదురుగా టీపాయ్ మీదే ఉంది. హెడ్‌లైన్స్ అన్నా చూడలేదు నిజానికి.. ప్రపంచం ఎలా నడుస్తోందో తెలుసుకోనే లేదు.

సత్యానందం పేపర్ అందుకున్నాడు. టుడేస్ ఎంగేజ్‌మెంట్స్ ఉన్న పేజీకి దూకాడు

ఆలస్యం చేయకుండా.

'అమ్మయ్య ! ఇందులో ఉంది'.

''సాయంత్రం ఆరుగంటలు : టౌన్‌హాల్, మిస్టర్ ఎస్. సత్యానందం స్పీక్స్ ఆన్ 'హ్యూమన్ రిజెనెరేషన్'''

మానవ పునర్వికాసం మీద ఉపన్యాసం !

కొత్త విషయమే.

దేశంలో జరగుతున్న దురాగతాలు, మనిషి పడుతున్న అవస్థలు - ఆవేదనలు, వీటన్నిటికీ మనిషే కారణం కావడం; అందుచేత మనిషి తప్పనిసరిగా మారవలసిన అవసరం ఉంది - అని నొక్కిచెప్పడం !

''ఇదే తాను 45 నిమిషాలలో చేయవలసిన పని. ప్రసంగం లేక ఉపన్యాసం మాట్లాడిన తరువాత ఎవరయినా ప్రశ్నలు వేస్తే వాటికి బుద్ధికి తోచినట్లు సమాధాలు చెప్పడం.

ప్రజల్లో చైతన్యం, ఎవేర్‌నెస్ తీసుకురావడం కోసం ఇలా నగరాలు, పట్టణాలు, పల్లెలు తిరిగి అనేక సాంస్కృతిక విషయాల మీద మాట్లాడడం అనే పనిని స్వచ్ఛందంగా స్వీకరించి - ఉద్యోగం కూడా మానుకుని - గత పదేళ్లుగా తిరుగుతున్నాడు అతను.

పుస్తకాలు వ్రాయడం - పత్రికల్లో వ్యాసాలు, చాలక ఈ పర్యటనలు ఎక్కువ మందికి ఎవేర్‌నెస్ కలిగించడం కోసం.

ఈ సంగతులు స్ఫురణకు తెచ్చుకుంటూ, స్క్రిబిల్ చేశాడు, కాగితం ముక్కమీద అయిదారు అంశాలు.

ఉపన్యాసం తయారయిపోయింది.

హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

తన ఉపన్యాసాలు వింటున్నవాళ్లు అమాయకులేమీ కాదు. తనకంటే బాగా చదువు కున్నవాళ్లే. విస్తృత జీవితానుభవం ఉన్నవాళ్లే. అయితేనేం ? రెండో మనిషి చెబుతూ ఉంటే ఆనందంగా వింటూ తమ పని అయిపోయిందన్నట్లుగా తన్మయులయి పోతారు.

సత్యానందం మళ్లీ కిటికీ తెరల దగ్గరకు వచ్చాడు.

టైం పన్నెండున్నర అయింది.

ఎదురుగా కనిపిస్తున్న ఇంటిదొడ్డి ఆవరణల్లో మనుషులు హడావిడిగా తిరుగు తున్నారు. వాళ్లలో ఒక ఇంటి అమ్మాయి మీద అతని దృష్టినిలిచింది. పాతిక ముప్పయి కంటే ఎక్కువ వయసు ఉండదు ఆ అమ్మాయికి. ప్రతిమారూ ఆమె చేతిలో ఏదో గిన్నె, గుడ్డ, గాజుసీసాలు ఉంటున్నాయి. పది పన్నెండు మార్లు ఆ అమ్మాయిని చూచినా ముఖం మాత్రం ఒక్కమారే కనిపించింది.

ఆ ముఖం ఎక్కడో చూచినట్లుంది.

ఎవరు ఈ అమ్మాయి ?

• • •

హాయిగా నిద్రపోతున్న సత్యానందానికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. పక్క మీద లేవకుండానే పరిసరాలన్నీ పరికించి చూశాడు.

పక్కనున్న టెలిఫోన్ మోగుతోంది.

టైం చూసుకున్నాడు. అబ్బ ! అప్పుడే ఎనిమిది గంటలయింది.

రింగ్ ఇంకా వస్తూనే ఉంది. అలవోకగా అందుకున్నాడు.

హలో - అనడం తప్పనిసరి.

''మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానేమో నాకు తెలియదు. క్షమించాలి'' అంది అవతలి గొంతు.

''చెప్పండి'' అన్నాడు ఉపోద్ఘాతాల పట్ల అంత ఆసక్తి చూపక.

''నేను మీ పక్కగదిలోనే ఉన్నాను. మీరు తయారై ఉంటే నా గదిలోనే బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవచ్చునని చెప్పటానికి పిలుస్తున్నాను. బొత్తిగా తెలియని మనుషులతో కాఫీ తీసుకోవడం మీకేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను. మీరు అంగీకరిస్తే...''

అవతలి గొంతు వాక్యం పూర్తి చేయక ముందే సత్యానందం అన్నాడు ''మీ ఆహ్వానానికి థాంక్స్. తప్పకుండా వస్తాను. కాకపోతే కాస్త ఆలస్యం అవుతుంది. ఇంకో అరగంట అయినా టైం కావాలి నాకు. మీ గది నెంబరు ఎంత ?''

''నూట తొమ్మిది. అన్నది అవతలి గొంతు. ''మీ కోసం కనిపెట్టుకు ఉంటాను.

తయారవగానే రండి. థాంక్యూ.''

తన అనుమతి అవసరం లేకుండానే రిసీవర్ క్రెడిల్ చేసింది. అవతల వ్యక్తి స్త్రీ అని పసిగట్టడం సత్యానందానికి కష్టం కాలేదు.

ఆమెను ఎక్కువ సేపు తన కోసం ఎదురు చూస్తూ కూర్చోబెట్టడం ఇష్టం లేక, న్యూస్ పేపర్ అవతలకు జరిపి, వెంటనే బాత్‌రూంకు వెళ్లాడు. త్వరత్వరగా తయారవుతే మంచిది. బ్రేక్‌ఫాస్ట్ అనేమాట వినరావడంతోటే అతనిలో ఆకలి కూడా ముందుకు వచ్చి కూర్చున్నట్లు అయింది.

రాత్రి హోటల్ గదికి వచ్చి చేరుకునేసరికి తొమ్మిదిన్నర అయింది. అప్పుడు ఏమీ తీసుకోవడం ఇష్టం లేక నిద్రకు పడ్డాడు. ఎలాంటి కలలు, చికాకులు లేకుండా ఇంతకు ముందు వరకూ నిద్ర సాగింది.

ఎవరు - తనకు ఇంత దయగా - ఉదయమే ఇంకా తాను నిద్రలేకముందే - బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించిన మనిషి ?

ఎవరయినా కావచ్చు. ఆ సంగతి ఆలోచన అనవసరం. తన ప్రయాణాలలో, ఉపన్యాస కార్యక్రమాలలో ఇలాంటి సన్నివేశాలు మామూలు అయిపోయినాయి.

ఎంగేజ్‌మెంట్ డైరీ ప్రకారం తనకు ఇప్పుడు వెంటనే ఏమీ పని లేదు. పదిన్నరకు ఆ కార్యదర్శి వస్తానన్నారు. అప్పుడు అతనితో యూనివర్శిటీకి వెళ్ళడం, పదకొండు నుంచి పన్నెండు గంటల వరకు ఉపన్యాసం. తరువాత లంచ్. మధ్యాహ్నం ఇంకేం పని లేదు. తిరుగు ప్రయాణం సాయంత్రం.

నిన్న సాయంత్రం అనుకున్న మీటింగ్ బాగానే జరిగింది.

ఏభై, అరవై మంది శ్రోతలు మటుకు వచ్చారు. చాలా మహానగరాలలో కంటే ఈ సంఖ్య ఎక్కువే!

ఇవి మీటింగులకు రోజులు కావు. సాంస్కృతిక, సామాజిక విషయాల మీద ఎవరికీ అంత అభిరుచి లేదు. ఎవరూ రారు. అయినా ఇలాంటి సభలు జరపడం, పదిమందినీ పోగు చేయాలని ప్రయత్నించడం, విషయాలు భిన్న భిన్న ధోరణుల మనుషుల ముందు ఉంచుతూ ఉండడం ... ఇంకా కొంతమంది చేస్తూనే ఉన్నారు.

సరీగా ఎనిమిది గంటల ముప్పైఅయిదు నిమిషాలకు షక్కగది తలుపు తట్టాడు,

కుడిచేతి చూపుడు వేలుమడిచి.

''రండి'' అని లోపలనుంచి బదులు వచ్చింది.

తలుపు తీసుకుని లోనికి వెళ్లాడు.

తన గదికి నకలు మరో గది. గది మధ్య ఆమె నిలబడి ఉంది. ''నమస్కారం'' అంది రెండు చేతులూ జోడించి.

సత్యానందం ప్రతి నమస్కారం చేశాడు.

''రండి కూర్చోండి'' అని ఆమె అతనికి సోఫా చూపింది. ఎదురు సోఫాలో తానూ కూర్చుంటూ, ''మీరు వచ్చినందుకు చాలా సంతోషం. ఏం తీసుకుంటారు చెప్పండి'' అంది రూంబోయ్ కోసం బెల్ నొక్కుతూనే.

''నన్ను మీరు నిన్న సాయంకాలం చూచి ఉంటారు'' అంది ఆమె.

సత్యానందం ఆమె వైపు సాలోచనగా చూచాడు.

''నిన్న మీరుఅడ్రెస్ చేసిన మీటింగ్‌కు వచ్చాను. మీ ఉపన్యాసం నాకు బాగా నచ్చింది. మీరు పక్కగదిలోనే ఉన్నారని తెలుసుకున్నాను. చొరవగా ప్రొద్దున్నే బ్రేక్ ఫాస్ట్‌కు ఆహ్వానించినందుకు మీరేమీ అనుకోవడం లేదు గద!'' అంది ఆమె అతి నిదానంగా.

ఆమె ఆకుపచ్చ జరీ చీర కట్టుకుంది.

టీపాయ్ మీద రెండుమూడు న్యూస్‌పేపర్లు పరచి ఉన్నాయి.

టేబుల్ మీద అరడజను పుస్తకాలు ఉన్నాయి.

చాలా ఆత్మీయమైన మనిషిని కలుసుకున్నట్లు అనిపిస్తోంది సత్యానందానికి.

అతనేమయినా సమాధానం చెప్పేలోపుగానే ఆమె కొనసాగించింది... ''నాపేరు వికాస. నాదీ ఊరు కాదు. వారం రోజులయి ఇక్కడే ఉన్నాను. నిన్న మీ ఉపన్యాసం వినడం పూర్తిగా యాదృచ్ఛికం. పత్రికలో ఎంగేజ్‌మెంట్స్ కాలం చూచి వచ్చాను. నాకు ఈ ఊళ్లో ఎవరూ తెలియరు'' అంది ఆమె.

''చాలా సంతోషం. తెలియడం, తెలియకపోవడం ఈ రెంటికీ పెద్ద తేడా ఏమీ లేదు. మనిషి ఈ భూగోళం మీద ఎక్కడ ఉన్నా అందరికీ కావలసినవాడే! అందరికీ ఆప్తుడే'' అన్నాడు.

''అలా అని సాంఘికశాస్త్రం చెబుతోంది. మీబోటి వాళ్లు ఈ విషయాన్ని జనం మరచి పోకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. అందుకే మిమ్మల్ని కలుసు కుందాం- అనుకున్నాను''

''చాలా థాంక్స్'' అన్నాడు సత్యానందం ముక్తసరిగా.

''మీ పుస్తకాలు కూడా చదివాను. మీ అభిప్రాయాలు చాలా నూతనంగా, ఆమోద యోగ్యంగా ఉంటాయి''

''మీరింకా పుస్తకాల భాషే మాట్లాడుతున్నారు'' అన్నాడు నవ్వుతూ.

వికాస కూడా నవ్వింది. ''వాడుక భాష ఉద్యమం ఎంత విస్తృతంగా ప్రచారంలోకి వచ్చినా మంచివాళ్లు మాట్లాడుకునేటప్పుడు అలాగే పుస్తకాలలో మాటలు దొర్లిపోవడం తప్పనిసరి అయిపోతోంది - సుమండీ!'' అంది ఆమె.

వేడి వేడి ఇడ్లీ తినడం అయిపోయింది. బాయ్ రెండో డిష్ కూడా తెచ్చి ముందు పెట్టాడు.

''మరేం చెప్పమంటారు?'' అనడిగింది ఆమె.

''నేను మీ కంటికి బకాసురుడిలా కనిపించడం లేదు గదా! నాకు ఇంకేం వద్దు. కాఫీ చాలు'' అన్నాడు సత్యానందం టై సరిచేసుకుంటూ.

''మళ్లీ ఒక గంట మాట్లాడాలి గదా మీరు. తరువాత ఎప్పుడో ఒంటి గంటకు గాని భోజనానికి కుదరదనుకుంటాను'' అంది ఆమె.

తన అవసరాలు తనకంటె ఆమెకే ఎక్కువగా తెలిసినట్లున్నాయి, అనుకున్నాడు.

''ఫరవాలేదండీ! యూనివర్సిటీలో వద్దనుకున్నా మళ్లీ కాఫీ తాగవలసి వస్తుంది'' అని మాత్రం అన్నాడు క్లుప్తంగా.

''... మనిషిలో మంచితనం నిజంగా ఉందంటారా? ... మిమ్మల్ని చూచినప్పుడు తప్పకుండా ఉండే ఉంటుంది అనిపిస్తుంది. అయినా నాకు ... అంత నమ్మకం చిక్కడం లేదండీ... నన్ను నిరాశావాది అని మాత్రం అనుకోకండి'' అంది ఆమె.

''ఉన్నదా ? - అని కచ్చితంగా అడిగితే ఏమీ చెప్పలేను. మనిషిలో ఉన్నది అదొక్కటే నా దృష్టిలో'' అన్నాడు సత్యానందం.

''మరి దేశంలో ఇన్ని కల్లోలాలు... గందర గోళాలు... మనిషిని మనిషి కాల్చుకు

తినడం ... ఇదంతా ....'' అంది వికాస.

''మంచితనం ఉంది. కాని అది మరుగుపడిపోయింది. చావలేదు. మంచితనం చావదు. తాత్కాలికంగా లుప్తమై పోతుంది. తగిన పోషణ లేకపోతే... అందుకే దాన్ని వెలికి తీసుకు రావటానికి - ఇంత సాహిత్యం, ఇన్ని పుస్తకాలు, ఎన్నో ఉపన్యాసాలు .. సెమినార్లు ...''

''ఎవరేనా ఇవే మాటలు చెబుతారు. తీరా ఆచరణ దగ్గరకు వచ్చేటప్పటికి స్వార్థం పైకి వచ్చి కూర్చుంటుంది. స్వార్థం పురులు విప్పుకున్నాక ఇతర ప్రపంచం అంతా ఏమయి పోయినా నాకేం బెంగలేదు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు మనిషి. ఎన్నయినా ఉదాహరణలు ఇవ్వవచ్చు. మీకు తెలియని విషయమేం కాదు...'' అంది ఆమె బరువుగా ఊపిరి పీలుస్తూ, వదులుతూ.

''ఉదాహరణల జోలికి వస్తే... మీరు ఇప్పుడు నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు పిలవడం మంచి తనం అంటారా, స్వార్థం అంటారా?''

''మీరే చెప్పండి'' అంది వికాస, బాధ్యత అతనికే ఇస్తూ.

''మీరు రమ్మనడం మీ మంచితనం. నేను రావడం నా స్వార్థం.''

వికాస అంగీకరించనట్లుగా తల అడ్డంగా తిప్పి ''మీరు అంతా తల్లక్రిందులు చేస్తున్నారు. మిమ్మల్ని పిలవడం నా స్వార్థం, మీరు రావడం మీ మంచితనం. కాదన కండి'' అంది.

''అలా కాదనకండి అని నన్ను ముందుకాళ్లకు బంధాలు వేసి కట్టేయడం కూడా మంచితనమే. సరే, కానివ్వండి. మిమ్మల్ని గురించి ఇంకా చెప్పండి. మీ దగ్గర ఎంతో తెలుసుకోవలసింది ఉన్నట్లు అనిపిస్తోంది'' అన్నాడు సత్యానందం.

అతని గొంతులో నిజాయితీ ఆమెను చాలా ఆకట్టుకుంది. కాఫీ కప్పు కింద పెడుతూ ఆమె షెల్ఫ్‌లో నుంచి అరటి పండు తీసి అతని ముందు ఉంచింది. ''కాదన కుండా ఇది కూడా తీసుకోండి''.

''ఈ ఊరు కాదన్నారు గదా ! ఎక్కడ నుంచి వచ్చారు ? ఈ ఊరు మీకు నచ్చిందా ? ఎన్నాళ్లు ఉంటారు ? అసలు ఎక్కడ మీరు ఉండేది ?'' అనడిగాడు సత్యానందం.

వికాస చెప్పింది ''అంత ఆసక్తికరమైన సంగతులేమీ లేవు లెండి నన్ను గురించి.

మంచితనం కోసం వెదుక్కుంటూ వచ్చాను ఈ ఊరు. అంతే.''

చాలా క్లుప్తంగా చెప్పింది ఆమె. తన తల్లీ, తండ్రీ అంగీకరించకపోయినా కావాలను కున్న కుర్రవాడిని వివాహం చేసుకున్నదట. అయిదేళ్లు హాయిగానే గడిచాయి. తరువాత అతనూ అందరిలాగానే తయారయ్యాడు.

''అంటే?'' అని అడిగాడు సత్యానందం వివరాలు చెప్పమని.

''డబ్బు ! తను బాగానే సంపాదిస్తున్నాడు. అయిని ఇంకా కావాలనిఆరాటం! మీ నాన్నగారి దగ్గర్నుంచి దోచుకు రా ... అంటాడు. నాకు ఇష్టం లేదు. డబ్బు మన ఇద్దరినీ విడదీస్తుందని చాలా సూటిగా చెప్పాను అతనికి. కాని వినడు, నాకూ ఉద్యోగం ఉంది. డబ్బుకేం చింత లేదు. అయినా ఏమిటో ? అతని పద్ధతి అంతా మారి పోయింది. అందరితోనూ పోల్చుకుంటాడు. వాళ్లు మనకంటే ఎంతో ఉన్నతంగా ఉన్నారంటాడు. చెరో కారూ లేకపోతే ఏమిటి జీవితం అంటాడు. అబ్బబ్బ... బొత్తిగా ఓ సంవత్సరం నుంచి విసిగి పోయాననుకోండి అతనితో...''

''మరి ఏం చేద్దామనుకుంటున్నారు?''

''అదే అర్థం కావడం లేదు. అతనితో కలిసి బతకడం కష్టం అయిపోతోంది. తీరికగా ఆలోచించుకుందామని, వారం రోజులు సెలవు తీసుకుని ఇక్కడికి వచ్చి కూర్చున్నాను. నా ఆలోచన ఇంకా తెగలేదు.''

''అయాం సారీ'' అన్నాడు సత్యానందం అనాలోచితంగా. వెంటనే నిలదొక్కు కుని ''జాలి ప్రకటిస్తున్నానని కోపగించుకోకండి. బాగా ఆలోచించండి. మీకే ఏదో మార్గం తోచక పోదు. తొందర పడకండి'' అన్నాడు.

''తొందర పడడం ఇదివరకే అయిపోయిందేమో అనుకుంటున్నాను. ఇప్పుడు జీవితమంతా విచారిస్తూ కూర్చోవడమే తీరుబాటుగా!''

సత్యానందం ఏమీ అనలేదు.

వికాస చెప్పసాగింది. ''ఎంతసేపూ ఎకడమిక్‌గా ఆలోచిస్తావు నువ్వు. ఏ మాత్రం ప్రాక్టికల్ పర్సన్‌వి కాదు - అంటాడు నన్ను. ప్రాక్టికల్ అంటే డబ్బు కోసం - ఏ మాత్రం మానవత్వం అనేదే లేకుండా - మనుషుల్ని దోచుకు తినడం - అతని భాషలో... హాయిగా ఉండడం అంటే మనిషి మనిషికీ వేరు వేరు అభిప్రాయాలు

ఉన్నాయి గదండీ'' అని ఆగింది ఆమె. ''నా వ్యక్తిగత విషయాలతో మిమ్మల్ని విసిగిస్తున్నామో ! క్షమించండి''.

''అబ్బే అదేం లేదు. మనుషుల ప్రవర్తన గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. అంతే''.

''జీవితాన్ని నడిపించుకోవడం మనిషి చేతుల్లో లేదా ? ఇంకా ఎవరో తెలియని వాళ్లు పై నుంచీ శాసిస్తారంటారా ?''

''అనను. కాని అందరూ ఒకే రకంగా ఆలోచించకపోవడం వల్ల ఈ చికాకులన్నీ వస్తున్నాయి కదూ?'' అని మాత్రం అనగలిగాడు.

''అప్పుడే తొమ్మిదిన్నర అయింది. మీరు మీ నెక్స్ట్ ఎసైన్‌మెంట్ గురించి ప్రిపేర్ అవాలో ఏమో!'' అంది ఆమె.

''ఎక్కువ తయారు అవవలసింది ఏం లేదు. పదిన్నరకు ఆ కార్యదర్శి వస్తారు. అన్నట్లు... మీకు వేరే ఏ ఎంగేజ్‌మెంట్ లేకపోతే మాతో పాటు యూనివర్శిటీకి రండి.''

''తప్పకుండా వస్తాను. అసలు నేనే అడుగుదామనుకున్నాను, మీ ఆహ్వానానికి థాంక్స్'' అంది వికాస.

బల్లమీద నుంచి ఓ పుస్తకం అందుకుంది. కవర్‌పేజీ తెరిచి ఇన్నర్ టైటిల్ అతని ముందు ఉంచుతూ, 'దయచేసి మీ సంతకం చేసి ఇవ్వరూ?' అనడిగింది. ఏ మాత్రం గర్వపడకుండా అతను సంతకం చేస్తూ ఉండడం గమనించింది. ''మీ తరువాతి పుస్తకాలు ఏమయినా వచ్చాయా?'' నాకు తెలియదు'' అంది.

''సరే యూనివర్సిటీకి వెళ్లేటప్పుడు పిలుస్తాను. రెడీగా ఉండండి'' అంటూ సత్యానందం అప్పటికి సెలవు తీసుకుని తన గదికి వెళ్లటానికి లేచాడు.

రూంకు వచ్చి విశ్రాంతి తీసుకుంటూ ఉండగా మళ్లీ డోర్ బెల్ మోగింది.

ఎవరు - అనుకుంటూనే తలుపు తెరిచాడు.

ఎదురుగా ఆ అమ్మాయి. నిన్న మధ్యాహ్నం ఇంటి వెనక ఆవరణలో పనుల హడావిడిలో చకచకా తిరుగుతూ ఉన్న అమ్మాయి.

''నమస్కారమండీ!'' అంది నవ్వుతూ.

ఆమెతో మరో మగమనిషి కూడా ఉన్నాడు. ''వీరు మా వారు!'' అని పరిచయం

చేసింది.

లాంఛనంగా నమస్కారం చేసి ఇద్దరినీ లోనికి ఆహ్వానించాడు.

''నన్ను మీరు గుర్తించ లేదనుకుంటాను. నేను మైథిలిని!'' అంది ఆ అమ్మాయి.

''నాపేరు శ్రీనివాసరావు'' అన్నాడు అతను.

''బి. ఏ.లో మీ స్టూడెంట్‌ను నేను. మాకు పొలిటికల్ థియరీ చెప్పేవారు మీరు'' అంది మళ్లీ మైథిలి.

''మిమ్మల్ని గురించి వినడమే గాని కలుసుకోవడం ఇప్పుడే మొదలు'' అన్నాడు శ్రీనివాసరావు. ''నేను ఇక్కడ ఓ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా ఉన్నాను''.

''చాలా సంతోషం'' అన్నాడు సత్యానందం ఇంకా అయోమయంగానే.

''మీ ఉపన్యాసం విన్నాం. తరువాత టౌన్‌హాల్లోనే కలుసుకుందాం అంటే మీ చుట్టూ జనం ఎంతకూ మిమ్మల్ని వదిలేట్లు లేదు. అందుకని మీరు బస చేస్తున్న హోటలు తెలుసుకుని ఇంటికి వెళ్లిపోయాం. తీరుబడిగా ఈ ఉదయం వచ్చాం'' అంది మైథిలి.

''చాలా శ్రమ తీసుకున్నారు'' అన్నాడు సత్యానందం.

''ఇందులో శ్రమ ఏమీ లేదులెండి. మేం ఉన్నది ఈ వీథిలోనే. ఈ పక్క ఇల్లే మాది. అందుకని ఒకమారు దర్శనం చేసుకుందామని వచ్చాం'' అన్నాడు శ్రీనివాస రావు వినయంగా.

''చాలా సంతోషం., ఎన్నాళ్ల నుంచి ఇక్కడ ఉంటున్నారు?''

'పెళ్లయినప్పటి నుంచి ఇక్కడే ఉన్నామండీ. మైథిలి మిమ్మల్ని గురించి ఎప్పుడూ చెతూ ఉంటుంది''

''నేను అంత చెప్పుకోతగిన మనిషినా ? అయినా నన్ను గురించి నాకే తెలియదు. మైథిలి ఏం చెబుతుంది నా గురించి ?''

మైథిలి నవ్వింది. ''మీ గొప్పతనం మీకు తెలియదు మాష్టారూ ! రిసీవింగ్ ఎండ్‌లో ఉన్నాం గనుక మిమ్మల్ని మేం మరచిపోలేం'' అంది. తరువాత శ్రీనివాసరావు చెప్పాడు - ''మైథిలిని ఒక కుర్ర లెక్చరర్ బారి నుంచి కాపాడి జీవితంలో ప్రమాదం నుంచి బయట పడవేశారు మీరు. దానికి మేమిద్దరం జీవితాంతం మీకు ఋణపడి

ఉండాలి!''

''కాలేజీల్లో ఇలాంటివి అప్పుడప్పుడు జరుగుతూనే ఉంటాయి. మంచి మాటలు చెప్పి దారి చూపించడమే గదూ మా పని!'' అన్నాడు సత్యానందం మామూలు ధోరణిలో.

''ఆ లెక్చరర్ మీకు కావలసిన వాడూ, బంధువులూ గదా !''

''అయితేనేం ? మంచిమాటలు చెబుతున్నప్పుడు బంధుత్వాలు అడ్డు రాకూడదు. ఆశ్రిత జన పక్షపాతానికి మొదటి నుంచీ వ్యతిరేకిని !''

''మీలాంటి వాళ్లు ఎంతమంది ఉంటారు మాష్టారూ ! చెడు జరుగుతూ ఉంటే మనదేం పోయిందిలే అని పక్కకకు తప్పుకునే వాళ్లే కదా అదరూ ! అందుకనే మీరు మాకు మరువ రారు... రేపు ఉంటున్నారా మాష్టారూ ? మా ఇంటికి ఒక మారు రారూ?''

''లేదమ్మా. ఉదయం ఆరింటికే తిరుగు ప్రయాణం అనుకున్నాను గాని ఈ రాత్రే వెళ్లిపోయే వీలు దొరికింది. ఈ మారు తప్పకుండా వస్తాను...'' అన్నాడు సత్యానందం.

''మీరు వస్తున్నట్లు మాకు తెలియనే తెలియదు. మధ్యాహ్నం యథాలాపంగా పేపర్లో చూచాను. అందుకనే ఆయన్ను తీసుకుని మీటింగ్‌కు వచ్చాను. మిమ్మల్ని చూడడం చాలా సంతోషంగా ఉంది మాష్టారు నాకు. కాని మీరు మా ఇంటికి రాకుండా ఉండడమే కష్టంగా ఉంది...''

''పోనీ ఒక పని చేయండి'' అన్నాడు సత్యానందం. ''మధ్యాహ్నం నాలుగు గంటలకు మీరిద్దరూ ఇక్కడికే రండి. నాతో టీ తీసుకుందురుగాని. అన్నట్లు మీకు ఆఫీస్ టైమ్స్ ఏమన్నా ఇబ్బంది అవుతుందా ?''

''ఫరవాలేదండీ. ఈ రోజు రెండు గంటలకే నేను ఇంటికి వచ్చేస్తాను'' అన్నాడు శ్రీనివాసరావు.

''టీ సమయంలో మీకో అమ్మాయిని పరిచయం చేస్తాను. ఆమెకు మీ సహాయం అవసరం అనుకుంటాను''.

''అలాగే సరే ! మీరు చెబితే ఏం చేయటానికయినా మేం ఇద్దరం సిద్ధమే!'' అని వాళ్లు సెలవు తీసుకు వెళ్లిపోయారు.

యూనివర్సిటీ మీటింగ్ కూడా యథాప్రకారం జరిగింది.

ప్రసంగం అయిన తరువాత ప్రశ్నలకు ఆహ్వానం.

సాధారణంగా ఇటువంటి టాపిక్ మాట్లాడినప్పుడు శ్రోతలు ఎవరూ ఏమీ ప్రశ్నలు వేయరు. ఎందుకంటే - సత్యానందం వెలిబుచ్చే అభిప్రాయాలు, ఆలోచనలతో ఎవరికీ వ్యతిరేకత ఉండదు, ఏకీభావమే గాని, అంతగా హృదయం లోనికి విషయం చొచ్చుకు పోయేట్లుగా సోదాహరణంగా మాట్లాడుతాడు అతను. దైనందిన జీవితాలలో జరుగుతున్న విషయాలే ప్రస్తావిస్తాడు. వాటిని అంతరంగంతో పులిమి కలియదిప్పుతాడు.

ఎవరూ ప్రశ్నలు వేయనప్పుడు తానే ఒక ప్రశ్న ఇన్వెంట్ చేసి, దానికి సమాధానం చెబుతాడు. అదో కొత్త ప్రక్రియ !

''ఇంత వరకు నేను చెప్పినదంతా సావధానంగా విన్నారు. మీకు ఒక్కటే అనుమానం, లేకపోతే ప్రశ్న ! ప్రపంచంలో ఎక్కడయినా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఉపన్యాసకుడు చెప్పే విషయాలన్నీ బాగానే ఉంటాయి. ఆదర్శం - ఐడియలిజం - కబుర్లు చెప్పటానికి, వినడానికి బాగానే ఉంటుంది గాని - ఒక్కటే ఒక్క చిక్కు సందేహం లాంటిది అందరి మనస్సుల్లోనూ ఉంటుంది. 'ఇదంతా యుటోపియన్‌గా ఉందే ! ఈ రోజుల్లో ఇది సాధ్యమా ? ఆచరణ యోగ్యమా ?' అని మీరంతా ఏక కంఠంతో అడగాలనుకుంటున్నారు'' అంటాడు సత్యానందం.

''శ్రోతలందరి ముఖాలలోను సంతోషం వెల్లి విరుస్తుంది. తాము అడగకుండానే తమ ప్రశ్నకు సమాధానం రాబోతుందని ఆ సంతోషం.

దానిని ఆసరాగా తీసుకుని - మరో నిముషం విరామం ఇచ్చాక, సత్యానందం ఇలా కొనసాగిస్తాడు ప్రసంగాన్ని.

''మనిషి మారాలి ... మారాలి... అని అందరూ అంటారు. దీని మీద సినిమాలు కూడా వచ్చాయి. మారడం సాధ్యమా - అని మీ ప్రశ్న. నాది ఒక్కటే సమాధానం.

''మారడం అవసరం అని గుర్తించినప్పుడు, ఆ మార్పును సాధ్యపరిచే, సుగమం చేసే ద్వారాలు వాటంతట అవే తెరుచుకుంటాయి. సాధ్యమా ?'' అని ప్రశ్న గుర్తుతో ఆగిపోతే ఆ ద్వారాలు ఎప్పుడూ మూసుకునే ఉండిపోతాయి.

''ముందు మారడం అవసరం - తప్పనిసరి అని గుర్తించండి.''

''మారకపోతే మనకు, మానవజాతికి వచ్చే అనర్థం గుర్తుకు తెచ్చుకోండి. మన ముందు తరాల వాళ్లకు ఇంతకంటే మంచి సమాజాన్ని, సంఘాన్ని అప్పగించ వలసిన బాధ్యత మనకు ఉన్నదని గుర్తించినప్పుడే మనం మార్పులకు దోహదం చేయగలం. ఆ గుర్తించడానికి నా ఉపన్యాసం ఏమయినా మీకు సహాయపడితే అదే పదివేలు! నమస్కారం'' అని కూర్చుండి పోతాడు.

శ్రోతలు ఉత్సాహంతో చప్పట్లు చరుస్తారు. ఇతని క్లుప్తీకరణకు. అదే ఆనందం ఇస్తుంది సత్యానందానికి. స్ఫూర్తి తీసుకు వస్తుంది అతని పనికీ, ప్రచారానికీ.

యూనివర్సిటీలోనే లంచ్ కూడా అయిపోయింది. వికాస అతని ప్రసంగాన్ని అమితంగా ఆస్వాదిస్తోంది అనడానికి ఆమె ముఖమే సాక్ష్యం.

తిరిగి వస్తున్నప్పుడు కారులోనే బ్రీఫ్‌కేస్ తెరిచి ఓ కొత్తపుస్తకం బయటకు తీశాడు. పుస్తకం పుటలు తెరిచి ఒక ఖాళీ పేజీలో ఇలా రాశాడు - ''అనుకోకుండా, అనుకోకుండానే అనంత విశ్వంలో మళ్లీ మళ్లీ వచ్చే వికాసానికి చిహ్నంగా... శ్రీమతి వికాసకు శుభాకాంక్షలతో'' సంతకం చేసి ఆ పుస్తకం ఆమెకు అందిస్తూ, ''సాయంత్రం నాలుగు గంటలకు నా గదికి వస్తారు గదూ, టీకి! అప్పుడు మీకో కొత్త దంపతుల్ని పరిచయం చేస్తాను. ఆ అమ్మాయి నా పూర్వ విద్యార్థిని. వాళ్లు ఈ ప్రక్కబంగళాలోనే ఉంటున్నారు. మీకు వాళ్ల పరిచయం ఉపకరించవచ్చు...'' అన్నాడు.

శ్రీమతి వికాస అతను రాసిన మాటలు చదవడంలో మునిగిపోయి అతనికి జవాబు చెప్పడం, పుస్తకం ఇచ్చినందుకు థాంక్స్ చెప్పడం కూడా మరచిపోయింది.

✦